
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



సోమశిలలో 35.12 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 35.12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 12,700 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,070
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,709
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,910
నవర (8 గ్రాములు)	రూ.55,280

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.4 /28.5

గాలిలో తేమ 56 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలో వాతావరణం శుక్రవారం మబ్బులు చేసి ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు.

దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలి



వైద్య వృత్తితో ప్రాణం పోస్తున్న డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిపై తరచూ దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడటం దుర్మార్గం. ఈ తరహాలో వ్యవహరించే వారిని కఠినంగా శిక్షించాలి. ఇలాంటి దారుణాలకు ఒడిగట్టాలంటే భయపడేలా పటిష్ట చట్టాలను తీసుకురావాలి. ఆడబిడ్డలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– అబ్దుల్ మున్నస్, జూనియర్ డాక్టర్, జీజీహెచ్

అప్పుడే ధైర్యంగా సేవలందిస్తారు..



ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే వైద్యులు, సిబ్బందిపై కొందరు అకారణంగా దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి దుశ్చర్యలకు ఒడిగట్టడం దారుణం. ప్రజల ప్రాణాలను రక్షించే డాక్టర్ల ప్రాణాలు తీయడాన్ని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి. వీరికి సంపూర్ణ రక్షణ ఇవ్వడంలో ప్రభుత్వానికి ప్రజలు తోడ్పడాలి. అప్పుడే వైద్యులు ధైర్యంగా సేవలందించగలరు.

– డాక్టర్ గోపీకృష్ణ, పీహెచ్‌సీ, మర్రిపాడు

దోషులను సమాజం నుంచి వెలేయాలి



వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైంది. రోగులను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంతో వైద్యుల పాత్ర ఎంతో కీలకం. అయితే ఇటీవలి కాలంలో వీరిపై దాడులు అధికమవుతున్నాయి. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిని సమాజం నుంచి వెలేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకొచ్చి వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ అశోక్, పీహెచ్‌సీ, బొమ్మవరం



న్యూస్‌రీల్

ఫోర్జరీ కేసులో టీపీఓ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరపాలక సంస్థ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో మరో టౌన్ ప్లానింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్‌ను నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గురువారం అరెస్ట్ చేశారు. వివరాలు.. కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో ఇద్దరు టీపీఓలు, మేయర్ భర్త జయవర్ధన్, ఆయన సహాయకుడు, ఇద్దరు సచివాలయ ఉద్యోగులు, ప్రైవేట్ ఇంజినీర్‌పై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. శివకృష్ణ, టీపీఓ దేవేంద్రను ఇప్పటికే అరెస్ట్ చేయగా, తాజాగా కరెంటాఫీస్ సెంటర్ వద్ద ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నారు.

గిడుగు సేవలు మరువలేనివి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు


నెల్లూరు(దర్గామిట్ట): తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి సేవలు మరువలేనివని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్లో గురువారం నిర్వహించిన గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొంటున్నామని చెప్పారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

కాళీయమర్దనాలంకారంలో వేణుగోపాలుడు



నెల్లూరు(బృందావనం): కృష్ణావతార మహోత్సవాలను పురస్కరించుకొని మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు కాళీయ మర్దనాలంకారంలో గురువారం దర్శనమిచ్చారు. విశేషాలంకారంలో కొలువైన వేణుగోపాలుడ్ని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా అమ్మిశెట్టి వెంకటరమేష్, శ్రీనివాసకుమారి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ దాసరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆప్రాన్ పనుల పరిశీలన



పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

సోమశిల: సోమశిల జలాశయం వద్ద జరుగుతున్న ఆప్రాన్ పనులను ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆప్రాన్ పనులను నాణ్యతతో వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పరమానంద ఆశ్రమం వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జి, రోడ్డును పరిశీలించి ఆర్ అండ్ బీ అధికారులతో చర్చించారు. జలాశయ దక్షిణ కాలువ నుంచి వస్తున్న లీకేజీ ప్రాంతాన్ని గుర్తించారు. ఈఈ దశరథరామిరెడ్డి, డీఈ రవీంద్రప్రసాద్, జేఈఈలు నిఖిల్, రామ్మోహన్‌రెడ్డి, సాయికృష్ణ, కన్‌స్ట్రక్షన్ మేనేజర్ రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీల కౌన్సెలింగ్ నేడు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్‌ను శుక్రవారం నిర్వహించనున్నామని ఎస్పీ కృష్ణకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌తో జిల్లా పోలీస్ కార్యాలయానికి ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లు వచ్చేస్తున్నాయ్..

- బ్యాలెన్స్ అయిపోయిందా కరెంట్ కట్
- నెల్లూరులో తొలిసారిగా ఏర్పాటు
- దశలవారీగా పూర్తిస్థాయిలో..
- కాలగర్భంలో కలిసిపోనున్న పాత విధానం

రీచార్జ్ చేస్తేనే ఇంట్లో వెలుగులు

విద్యుత్‌ను వాడుకొని ప్రతి నెలా జారీ అయ్యే బిల్లులను చెల్లించడం ఇప్పటి వరకు వస్తున్న పద్ధతి. ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరిగినా, అపరాధ రుసుముతో చెల్లించే వెసులుబాటుంది. అయితే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే దిశగా ఎస్పీడీసీఎల్ సన్నాహాలు చేస్తోంది. నూతన విధానం ద్వారా ప్రీ పెయిడ్ మీటర్లకు రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. అలా చేయకపోతే సరఫరా ఆటోమేటిక్‌గా కట్ అయిపోతుంది. ఇప్పటి వరకు అమలవుతున్న విధానానికి అలవాటు పడిన వినియోగదారులకు దీనిపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.





నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో ఇక స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే దిశగా కసరత్తు జరుగుతోంది. ఈ ప్రక్రియలో నిరంతరం సరఫరా పొందాలంటే ముందే రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. వాస్తవానికి ఇప్పటి వరకు ఇళ్లలో వినియోగించే మీటర్లు ఎలా ఉంటాయో అందరికీ తెలిసిందే. ఎంత మేరకు వినియోగించామనే అంశం యూనిట్ల రూపంలో మీటర్లో తెలుస్తుంది. నెలకు వాడిన యూనిట్లను లెక్కగట్టి విద్యుత్ బిల్లులను సంబంధిత రీడర్లు జారీ చేస్తారు. దీనికి సంబంధించిన మొత్తాన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు లేదా ఆన్‌లైన్ ద్వారా ఇప్పటి వరకు వినియోగదారులు చెల్లిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది పోస్ట్‌పెయిడ్ తరహాలో ఉంటుంది.

ఇక ముందే చెల్లించాలి

రానున్న రోజుల్లో ఏర్పాటు చేయనున్న స్మార్ట్ మీటర్లు ప్రీ పెయిడ్ తరహాలో పనిచేస్తాయి. అంటే నిర్ణీత మొత్తానికి రీచార్జ్ చేసుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. మరోవైపు విద్యుత్ వాడకంపై యాప్‌లో ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు వస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో రాత్రి వేళ రీచార్జ్ మొత్తం పూర్తయినా, మరుసటి రోజు ఉదయం వరకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండదు. తదుపరి రీచార్జ్ చేసుకున్నాక, వాడుకున్న మొత్తాన్ని అందులో నుంచి మినహాయిస్తారు.

తొలిసారిగా..

రాష్ట్రంలో తొలిసారిగా విశాఖపట్నంలో.. జిల్లాలో నగరంలోని కొత్తూరులో గల తెలుగుగంగ ఈఈ కార్యాలయంలో స్మార్ట్ మీటర్‌ను ఇటీవల ఏర్పాటు చేశారు. మొదట ప్రభుత్వ కార్యాలయాల్లో.. అనంతరం పూర్తిస్థాయిలో అవగాహన వచ్చాక దశలవారీగా ప్రతి ఇంట్లోనూ స్మార్ట్ మీటర్లను నెలకొల్పనున్నారు.

ఎలా పనిచేస్తుందంటే..?

- ఇళ్లలో ప్రస్తుతం ఉండే మీటర్‌కు భిన్నంగా స్మార్ట్ మీటర్ పనితీరు ఉంటుంది.
- ముందుగానే రీచార్జ్ చేసుకోవాలి. సెల్ ఫోన్లో బ్యాలెన్స్‌ను ఏ విధంగా చూసుకుంటామో.. ఇక్కడ అదే విధంగా యాప్‌లో చెక్ చేసుకోవచ్చు.
- బ్యాలెన్స్ ఉన్నంత వరకే విద్యుత్ సరఫరా ఉంటుంది. నగదు అయిపోయిన వెంటనే సరఫరా బంద్ అవుతుంది. రీచార్జ్ చేస్తేనే విద్యుత్ వెలుగులుంటాయి.
- బ్యాలెన్స్ ఎంత ఉందో తెలియజేస్తూ నోటిఫికేషన్లు వస్తుంటాయి.

నష్టాలూ ఉన్నాయి..

- విద్యుత్ సంస్థను నమ్ముకొని ఎన్నో ఏళ్లుగా మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. ఈ విధానం పూర్తిస్థాయిలో అమలైతే వారి ఉపాధికి పెద్ద దెబ్బేనని చెప్పొచ్చు.
- అవగాహన లేమితో రీచార్జ్ చేసుకోవడంలో వినియోగదారులు ఏ మాత్రం అలసత్వం వహించినా, సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంటుంది.
- విద్యుత్ చౌర్యం పెరిగే అవకాశం ఉంది. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు..

డిస్కమ్‌లు నష్టాల ఊబిలో కూరుకుపోతుండటం.. మొండి బకాయిలు పేరుకుపోతుండటంతో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో దశలవారీగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు విద్యుత్ సంస్థలు కసరత్తు ప్రారంభించాయి.

ఉచితమంటూనే ఇసుక దోపిడీ



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- అనధికారికంగా రీచ్‌లలో పడి తోడేస్తున్నారు
- మూడు రెట్లు అధికంగా విక్రయం
- గత ప్రభుత్వ హయాంలో రూ.నాలుగు వేల కోట్ల ఆదాయం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని అన్ని రీచ్‌లలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ట్రాక్టర్ ఇసుకను జిల్లాలో సరాసరిన రూ.ఐదు వేలకు అందించారని, దీని ద్వారా గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వానికి రూ.నాలుగు వేల కోట్ల ఆదాయం సమకూరిందని చెప్పారు. ఉచిత ఇసుక అని ప్రకటనలు చేసిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం .. రవాణా ఖర్చుల పేరుతో మూడు, నాలుగు రెట్లు అధికంగా విక్రయిస్తోందని ధ్వజమెత్తారు. ఫలితంగా వినియోగదారులకు ఇసుక లభించడం కష్టమవుతోందని చెప్పారు.

ఇసుక కొరతతో ఇక్కట్లు

రాష్ట్రంలో ఇసుక కొరతతో ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టీడీపీ నేతల సిఫార్సు ఉంటేనే ఇసుక దొరుకుతోందని చెప్పారు. సంగం సమీపంలోని సూరాయపాళెం రీచ్ వద్ద ఇసుకను అధిక ధరలకు విక్రయించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని, దీంతో అదే విధానం అమలవుతోందని విమర్శించారు. ఇసుక ఉచితమని చెప్పి అధిక ధరలకు విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయం ఎవరి జేబుల్లోకి వెళ్తోందని ప్రశ్నించారు. జిల్లాలో అక్రమ మైనింగ్ జరిగిందని కూటమి ప్రభుత్వం చెప్తోందని, అయితే గత ప్రభుత్వంలో జిల్లా మైనింగ్ డీడీగా ఉన్న అధికారినే ఎందుకు కొనసాగిస్తోందని ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడి ఉంటే చర్యలు ఎందుకు చేపట్టడంలేదన్నారు. ఇసుక విషయంలో పెత్తనం కోసం టీడీపీ నేతల మధ్య ఘర్షణలూ జరుగుతున్నాయని తెలిపారు. ఇసుకను దోచు కుంటున్న వారిపై కేసులు పెట్టండంటూ అధికార పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే గళం విప్పుతున్న అంశాన్ని ప్రస్తావించారు. అధికార పార్టీపైనే విమర్శలు చేయడం ప్రారంభమైందనే అంశం దీని ద్వారా తెలుస్తోందని చెప్పారు. ఇసుక విధానంలో సరైన చర్యలు చేపట్టి సరసమైన ధరలకు ప్రజలకు అందించేలా చూడాలని, లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

గ్రామీణ స్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం

- కలెక్టర్ ఆనంద్
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆనంద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి కరెంటాఫీస్ సెంటర్ వరకు క్రీడాకారులు, విద్యార్థులతో ర్యాలీని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న స్టేడియాలను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నెల్లూరు రూరల్ పరిధిలోని మొగళ్లపాళెంలో అన్ని హంగులతో పూర్తయిన మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రజాప్రతినిధుల సమక్షంలో త్వరలోనే ప్రారంభించనున్నామని ప్రకటించారు. ఉపాధి పనుల్లో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో మైదానాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తొలుత స్టేడియం ఆవరణలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. తదుపరి వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఆటపాటలతో కొద్దిపాటి వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక..

- రైలు కిందపడి యువకుడి బలవన్మరణం
- జీర్ణించుకోలేక తల్లి ఆత్మహత్యాయత్నం



నరేంద్ర మృతదేహం

నెల్లూరు(క్రైమ్): అప్పులపాలై రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్లో గురువారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. విడవలూరు మండలం గాదెలదిన్నెకు చెందిన సరస్వతమ్మ, చలపతి దంపతులకు కుమారుడు నరేంద్ర (30), కుమార్తె ఉన్నారు. గూడూరులోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో నరేంద్ర పనిచేస్తున్నారు. అనారోగ్యంతో మూడేళ్ల క్రితం తండ్రి మృతి చెందడంతో కుటుంబబాధ్యతలను నరేంద్ర చూసుకోసాగారు. ఈ నేపథ్యంలో అప్పులపాలై, వీటిని తీర్చలేక రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనకు ముందు ఆత్మహత్య విషయాన్ని వాయిస్ మెసేజ్ రూపంలో కుటుంబసభ్యులకు పంపారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. జీర్ణించుకోలేని తల్లి రైలుకింద పడేందుకు యత్నించడంతో తలకు గాయమైంది. నారాయణ వైద్యశాలలో ఆమె చికిత్స పొందుతున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి రైల్వే పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వన మహోత్సవం నేడు

నెల్లూరు(అర్బన్): కొత్తూరు సమీపంలోని నగరవనంలో వన మహోత్సవాన్ని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నామని డీఎఫ్‌ఓ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అటవీ ప్రాంతాన్ని నగర ప్రజలకు చేరువ చేసేందుకు గానూ నగరవనాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఇక్కడ ఆహ్లాదాన్ని అందించనున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖల సమన్వయంతో ఈ ఏడాది లక్షలాది మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రజాప్రతినిధులు, మంత్రులు, కలెక్టర్ హాజరుకానున్నారని వివరించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- స్టాండింగ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీటీసీ సభ్యులు సూచించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఏడు స్థాయీ సంఘ సమావేశాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, కల్వర్టులు, ఉపాధి పనులు, తాగునీటి సరఫరా, జిల్లా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి సభ్యులు కోరిన పనులను త్వరగా చేపట్టాలని సూచించారు.

అన్నీ సమస్యలే..

గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని.. ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని.. హౌసింగ్ బిల్లులను సక్రమంగా చెల్లించడంలేదని అధికారుల దృష్టికి పలువురు సభ్యులు తీసుకొచ్చారు. దీనిపై హౌసింగ్ అధికారులు మాట్లాడుతూ.. 2025 మార్చి నాటికి పీఎంఏవై 1.0 పూర్తవ్వనుందని, మార్చి నుంచి 2.0 స్కీమ్ ప్రారంభంకానుందని తెలిపారు. ఈలోపు పాత ఇళ్లను పూర్తి చేసేందుకు వంద రోజుల ప్రణాళికను అమలు చేయనున్నామని వెల్లడించారు. మేళాను నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లను వేగంగా నిర్మించుకునేలా బిల్లులను మంజూరు చేయనున్నామని పేర్కొన్నారు. బేస్‌మెంట్ పూర్తయిన గృహాలకు రూ.లక్షను మంజూరు చేస్తామని వెల్లడించారు.

ఉపాధి పనులను ఎక్కువగా చేపడతాం

ఉపాధి హామీ పనులను ఎక్కువగా చేపట్టేందుకు చర్యలు చేపట్టామని డ్వామా పీడీ శ్రీనివాసులు తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ పనులు చేస్తున్నామని చెప్పారు. అనంతరం జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు మాట్లాడారు. సమావేశాలకు మండల, డివిజన్ స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు చేపట్టేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

సన్మానం

సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయీ సంఘ సమావేశాలకు తొలిసారిగా విచ్చేసిన నెలవల విజయశ్రీని ఆనం అరుణమ్మ తదితరులు సత్కరించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్, హౌసింగ్ ఈఈలు మాధవరావు, మోహన్‌రావు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్థక శాఖ జేడీ కోటేశ్వరరావు, ఆర్ అండ్ బీ డిప్యూటీ ఎస్‌ఈ సురేష్, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై దృష్టి సారించండి



వివిధ అంశాలను ప్రస్తావిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): విద్యారంగంలో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల పని సర్దుబాటు, క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటును ఏ క్యాడర్ స్ట్రెంత్ ఆధారంగా చేస్తున్నారని ప్రశ్నించారు. హైస్కూల్ ప్లస్‌లో గతేడాదితో పోలిస్తే ఈ విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ఎందుకు తగ్గాయని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరతకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారని ఆర్‌ఐఓను ప్రశ్నించారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల భవనాలను పూర్తి చేసేందుకు ఏ మేరకు నిధులు అవసరమో తెలపాలని కోరారు. పలు అంశాలను ఆయన ప్రస్తావించగా, విద్యాశాఖాధికారులు సమాధానమిచ్చారు.

31నే పింఛన్ల పంపిణీ

నెల్లూరు(దర్గామిట్ట): సెప్టెంబర్ ఒకటి ఆదివారం కావడంతో, ఒక రోజు ముందే పింఛన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో లేని కారణంగా పింఛన్లను శనివారం అందుకోకపోతే, సోమవారం అందించేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. పింఛన్ల రూపంలో జిల్లాలో 3,10,700 మందికి రూ.131,41,75,500 మేర అందజేయనున్నామని వెల్లడించారు. ఉదయం ఆరు నుంచే ప్రక్రియను ప్రారంభించనున్నామని, పింఛన్‌దారులు ఇళ్ల వద్ద అందుబాటులో ఉండాలని కోరారు.



చాలా బాధాకరం



ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లు, వైద్య సిబ్బందికి రక్షణ లేకపోవడం చాలా బాధాకరం. ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించి అమలు చేయకపోతే భవిష్యత్‌లో ధైర్యంగా విధులు నిర్వర్తించలేం. మహిళా సిబ్బంది భయం లేకుండా పనిచేసేలా చట్టాలుండాలి. అవి కఠినంగా అమలు చేస్తేనే సమాజంలో భరోసా ఉంటుంది.

– డి.ధనలక్ష్మమ్మ, స్టాఫ్‌ నర్స్, సీతారామపురం పీహెచ్‌సీ

సిబ్బంది భయపడుతున్నారు



కోల్‌కతా ఘటనతో రాత్రివేళల్లో సిబ్బంది పనిచేయాలంటే భయపడుతున్నారు. వారికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే మహిళా డాక్టర్ల రక్షణపై దృష్టిసారించాలి. అలాగే సిబ్బందిపై దాడికి పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి.

– ఆయూబ్‌ అఫ్సర్, వైద్యాధికారి, దుత్తలూరు పీహెచ్‌సీ

అండగా ఉండండి



సమాజంలోని మహిళా డాక్టర్లకు, నర్సులకు అండగా ప్రతిఒక్కరూ ఉండాలి. వారితో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, దాడులు చేసినా ప్రభుత్వం కఠినమైన కేసులు నమోదు చేసి శిక్షించాలి. కోల్‌కతాలో ఘటన సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేసింది. దోషులను తక్షణమే శిక్షించాలి. ప్రభుత్వాస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు, నర్సులకు సెక్యూరిటీని పెంచాలి.

– డాక్టర్‌ నరేంద్ర, ప్రొఫెసర్, జనరల్‌ మెడిసిన్, పెద్దాస్పత్రి



శాంతిభద్రతలు దారికొచ్చేనా..!

జిల్లాలో పెరిగిన హత్యలు, దొంగతనాలు

- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీస్‌ బాస్‌ ప్రయత్నం
- పాతనేరస్తుల కదలికలపై నిఘా
- కార్డన్‌ సెర్చ్‌లకు శ్రీకారం

జిల్లాలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి. రౌడీషీటర్లు చెలరేగిపోతున్నారు. హత్యలు, దొంగతనాలు, దాడులు సర్వసాధారణమయ్యాయి. ఎప్పుడు ఎక్కడ ఏ నేరం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. నిఘా నిస్తేజంగా మారిందనే ఆరోపణలున్నాయి. సోమవారం తెల్లవారుజామున పాత నేరస్తుడి హత్య జరగడంతో పోలీస్‌ శాఖ అప్రమత్తమైంది. ఎస్పీ కృష్ణకాంత్‌ ఆదేశాలతో క్షేత్రస్థాయి సిబ్బంది శాంతిభద్రతలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే వారి చర్యలు ఏ మేరకు ఫలిస్తాయో చూడాలి.

నెల్లూరు(క్రైమ్‌): రోజురోజుకు నేరాల సంఖ్య పెరుగుతుండడంతో పోలీస్‌ బాస్‌ అప్రమత్తమయ్యారు. సమావేశాలు నిర్వహించి ఏ చర్యలు తీసుకోవాలో అధికారులు, సిబ్బందికి చెప్పారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో గస్తీ పెంపు, జిల్లాలోని రౌడీషీటర్లు, సస్పెక్టెడ్, డీసీ, కేడీ షీట్ల కదలికలపై నిఘా పెంచుతున్నారు. పల్లెనిద్ర పేరిట డీఎస్పీ స్థాయి అధికారి నుంచి ఎస్సైల వరకు తమ ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడుతూ నేర నియంత్రణా చర్యలపై అవగాహన, పోలీసు సేవలను వివరిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నారు. సీసీ కెమెరాల నిఘాలోకి జిల్లాను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు శివారు ప్రాంతాల్లో కార్డన్‌ సెర్చ్‌లు మొదలుపెట్టారు.

ఎందుకు చేస్తారంటే..

వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఉపాధి నిమిత్తం జిల్లాకు వస్తున్నారు. నగర, పట్టణ శివార్లు అత్యంత వేగంగా విస్తరిస్తున్నాయి. నూతనంగా పలు కాలనీలు వెలుస్తున్నాయి. వీటిలో అసాంఘిక శక్తులు తలదాచుకుని సమయం చూసి నేరాలకు పాల్పడే అవకాశం లేకపోలేదు. ఈక్రమంలో నేరస్తులను ముందస్తుగానే కట్టడి చేసి నేరాలను నియంత్రించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న వారి సమగ్ర వివరాలు సేకరించేందుకు కార్డన్‌ సెర్చ్‌ చేస్తారు.

సెర్చ్‌ ఇలా..

నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలు, అసాంఘిక శక్తులు అధికంగా తలదాచుకునే ప్రాంతాలు, శివారు ప్రాంతాలను ఎంచుకుంటారు. తెల్లవారుజామున ఒకేసారి పోలీసు బలగాలు నిర్దేశిత ప్రాంతాలను చుట్టుముడతాయి. ఎవరూ బయటకు వెళ్లకుండా, బయటి ప్రాంతాల నుంచి లోనికి రాకుండా చర్యలు తీసుకుని ఆ ప్రాంతాల్లో ప్రతి అణువు జల్లెడ పడతారు. అక్కడున్న వాహనాలు, అనుమానిత వస్తువులు, ఇతర విషయాలపై ఆరా తీస్తారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలు స్వాధీనం చేసుకుంటారు. ఇంట్లో ఉన్న వ్యక్తుల వివరాలను సేకరిస్తారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలిస్తారు. అనంతరం వారిని పూర్తిస్థాయిలో విచారించి నేరాలకు సంబంధం లేని వ్యక్తులని తేలితే వదిలేస్తారు. నేరస్తులని తేలితే వారిని తమదైన శైలిలో విచారిస్తారు. రికార్డుల్లేని వాహనాలుంటే కోర్టుకు అప్పగిస్తారు.

నిందితులు దొరికితే..

నేరస్తులు ఒక్కోసారి వారి కదలికలు ఎవరూ గుర్తుపట్టడం లేదని సైలెంట్‌గా ఉంటారు. కొందరు వేరే ప్రాంతాల్లో నేరాలు చేసి గుట్టుచప్పుడు కాకుండా గడుపుతుంటారు. కొన్ని చోరీ కేసుల్లో సొత్తులు రికార్డు ల్లేకుండా ఉంటాయి. అలాగే నేరాలు చేసేందుకు సన్నద్ధమయ్యేవేళ వారి కదలికలు అనుమానాస్పదంగా ఉంటాయి. వీటిని నిరోధించాలంటే ముందుగా నేరాలను తగ్గించేందుకు కార్డన్‌ సెర్చ్‌లు దోహదపడతాయి. నిందితులు దొరికితే పెండింగ్‌లో ఉన్న కేసుల్లో చిక్కుముడులు వీడతాయి.

ప్రజలు సహకరించాలి

ప్రజలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలి. వారి వద్ద ఉన్న గుర్తింపుకార్డులు, ఇంట్లో ఉన్న వారి వివరాలు, బంధువులు వస్తే వారి వివరాలను తెలియజేయాలి. పోలీసులు వచ్చిన సమయంలో ఆందోళన చెందకుండా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. పాతనేరస్తులు, అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తులు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి.



సంతపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌

నేరాల కట్టడికి చర్యలు



జిల్లాలో నేరాల కట్టడికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. బీట్‌ వ్యవస్థను పటిష్టం చేశాం. అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాం. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలు, శివారు ప్రాంతాల్లో గస్తీ ముమ్మరం చేస్తున్నాం. కార్డన్‌ సెర్చ్‌లు చేపట్టాం. దీని ద్వారా నేరాలు కట్టడితోపాటు పెండింగ్‌ కేసుల్లో చిక్కుముడి వీడే అవకాశం ఉంది. ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలకు పోలీసులు ఉన్నారనే ధైర్యం కలుగుతుంది.

– జి.కృష్ణకాంత్, ఎస్పీ



సెర్చ్‌లో భాగంగా ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్‌బైక్‌లు



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

తాజాగా చంద్రబాబు నగర్‌లో..

చంద్రబాబునగర్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 27వ తేదీ తెల్లవారుజామున నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదాయపాళెం, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్లు ఆర్‌ఎస్‌ కిశోర్‌కుమార్, రోశయ్యలు సిబ్బందితో ఇళ్లను జల్లెడ పట్టారు. పద్ధతి మార్చుకోకపోతే పీడీ యాక్ట్‌లు, నగర బహిష్కరణ తప్పదని రౌడీషీటర్లను హెచ్చరించారు. వాహన పత్రాల్లేని 17 మోటార్‌బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ఫైర్‌ సర్వీస్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌



చంద్రశేఖర్‌

నెల్లూరు(క్రైమ్‌): ఏపీ స్టేట్‌ డిజాస్టర్‌ రెస్పాన్స్‌ అండ్‌ ఫైర్‌ సర్వీస్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరు అగ్నిమాపక కేంద్రం కానిస్టేబుల్‌ కె.చంద్రశేఖర్‌ రెండోసారి ఎన్నికయ్యారు. అసోసియేషన్‌ ఎన్నికలు బుధవారం గుంటూరు నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగాయి. చంద్రశేఖర్‌ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా విశాఖపట్నంకు చెందిన బాలకృష్ణ, కోశాధికారిగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సత్యనారాయణ, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన పి.రాజేంద్రప్రసాద్‌ ఎన్నికయ్యారు. చంద్రశేఖర్‌ను జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, ఏపీ జేఏసీ నాయకులు గురువారం అభినందించారు.

హెల్త్‌ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్‌



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న మస్తాన్‌బీ

నెల్లూరు(అర్బన్‌): జిల్లాలో రోజురోజుకు విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో హెల్త్‌ ఎమర్జెన్సీ ప్రకటించి వ్యాధుల నివారణకు కృషి చేయాలని డీవైఎఫ్‌ఐ, ఐద్వా నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు నెల్లూరు సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఐద్వా మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడుతూ డెంగీ, మలేరియాతోపాటు వైరల్‌ జ్వరాలు ప్రజలను పట్టిపీడిస్తుంటే వైద్యశాఖ చోద్యం చూస్తోందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్‌ చేయడం లేదన్నారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌ బాల్స్‌ వేయకపోవడం సిగ్గు చేటన్నారు. జ్వరాల నియంత్రణకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి మందులు అందజేయాలన్నారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు.

నేటి నుంచి రేడియాలజిస్ట్‌ల రాష్ట్ర కాన్ఫరెన్స్‌

నెల్లూరు(అర్బన్‌): ఇండియన్‌ రేడియాలాజికల్‌ అండ్‌ ఇమేజింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడురోజులపాటు రాష్ట్ర స్థాయి రేడియాలజిస్ట్‌ల కాన్ఫరెన్స్‌ జరుగుతుందని క్లారిటీ స్కాన్స్‌ సెంటర్‌ అధినేత డాక్టర్‌ ఉమామహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు నారాయణ వైద్యకళాశాలలో వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. శని, ఆదివారాల్లో మినీబైపాస్‌రోడ్డులోని పీవీఆర్‌ కన్వెన్షన్‌ హాల్లో కాన్ఫరెన్స్‌ జరుగుతుందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పేరున్న 700 మందికిపైగా రేడియాలజిస్ట్‌లు పాల్గొంటారని తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్‌

సోమశిల: పడమటికంభంపాడు ఇసుక రీచ్‌ నుంచి సోమశిల గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా గురువారం ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి పట్టుకున్నారు. ట్రాక్టర్లను సోమశిల స్టేషన్‌కు అప్పగించగా ఏఎస్సై మురళి కేసు నమోదు చేశారు.

దొంగ అరెస్ట్‌

నెల్లూరు(క్రైమ్‌): ప్రయాణికుడి జేబులోని నగదు కాజేసిన ఘటనలో నిందితుడిని నెల్లూరు నవాబుపేట పోలీసులు గురువారం అరెస్ట్‌ చేశారు. వారి కథనం మేరకు.. విడవలూరు మండలం రామతీర్థంలో అన్వేష్‌ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన బుధవారం నాయుడుపేటలోని బంధువుల వద్దకు వెళ్లాడు. తన అవసరాల నిమిత్తం రూ లక్ష నగదు అప్పుగా తీసుకుని నెల్లూరుకు వచ్చాడు. ఆత్మకూరు బస్టాండ్‌ వద్ద రామతీర్థం బస్సు ఎక్కే సమయంలో అతని జేబులోని నగదు అపహరణకు గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట ఇన్‌స్పెక్టర్‌ షేక్‌ అన్వర్‌బాషా కేసు దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు పోతిరెడ్డిపాళేనికి చెందిన ఖాజామస్తాన్‌గా గుర్తించారు. గురువారం అరెస్ట్‌ చేసి రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని గంటల వ్యవధిలోనే అరెస్ట్‌ చేసిన ఇన్‌స్పెక్టర్, క్రైమ్‌ పార్టీ సిబ్బందిని డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి అభినందించారు.

టీడీపీ నాయకుడి దౌర్జన్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: టీడీపీ నాయకుడు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. జొన్నవాడకు చెందిన మాజీ ఎంపీటీసీ రాగాల ప్రసాద్‌కు సపోట తోట ఉంది. ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పి.హరనాథ్, కొంతమంది కార్యకర్తలు కలిసి గురువారం సాయంత్రం తోటలోని చెట్లను నరికారని బాధితుడు ప్రసాద్‌ వాపోయాడు. పాతకక్షలను దృష్టిలో ఇలా చేశాడని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మాటామాటా పెరిగి.. చంపేస్తాడని భావించి..

- పాతనేరస్తుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్ట్‌



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్‌): నెల్లూరు నగరంలో కలకలం రేకెత్తించిన పాతనేరస్తుడు గుంజి రవి అలియాస్‌ కత్తి రవి హత్య కేసులో నిందితులను బాలాజీ నగర్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. గురువారం బాలాజీ నగర్‌ పోలీసుస్టేషన్‌లో నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి స్థానిక ఇన్‌స్పెక్టర్‌ కె.సాంబశివరావుతో కలిసి వివరాలను వెల్లడించారు. జనశక్తినగర్‌కు చెందిన కత్తి రవి (32) పాతనేరస్తుడు. కొంత కాలంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని దక్షిణ కైలాస్‌ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 25వ తేదీన స్నేహితుడి ఇంట్లో వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు నెల్లూరుకు వచ్చాడు. పెళ్లి తర్వాత రాత్రి రవి తన స్నేహితులైన చంద్రమౌళి నగర్‌కు చెందిన సాయితేజ అలియాస్‌ కమ్మసాయి, వంశీకృష్ణ అలియాస్‌ నిప్పోసాయి, పవన్‌కుమార్‌ అలియాస్‌ పవన్, నారాయణ, వెంకటరెడ్డి నగర్‌కు చెందిన వెంకటేష్‌ అలియాస్‌ వెంకీ డాన్‌తో మద్యం తాగాడు. రవికి పాత వేదాయపాళేనికి చెందిన సుజన్‌కృష్ణ అలియాస్‌ చింటూతో ఫోన్‌లో మాటామాటా పెరిగింది. అంతు చూస్తామని ఒకరినొకరు బెదిరించుకున్నారు. రవి కమ్మసాయి భార్యకు ఫోన్‌ చేసి అసభ్య పదజాలంతో దూషించాడు. రవి కోపంలో చింటూను చంపేస్తాడని కమ్మసాయి, వెంకీ డాన్, నిప్పో సాయి, పవన్, నారాయణలు భావించారు. దీంతో చింటూను కలుపుకొని రవిని హత్య చేయాలని వారంతా నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా చింటూ తాను ముత్తుకూరు బస్టాండ్‌ వద్ద ఉన్నానని రవికి ఫోన్‌లో చెప్పాడు. ఆటో డ్రైవర్‌ రవితేజ వారిస్తున్నా వినిపించుకోకుండా రవి ముత్తుకూరు బస్టాండ్‌ వద్దకు వెళ్లాడు. చింటూకు ఫోన్‌ చేసినా తీయకపోవడంతో ఎదురుచూసి వెనుదిరిగారు. రామలింగాపురం రైల్వే అండర్‌ బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి చింటూ ఫోన్‌ చేయడంతో సమీపంలో ఉన్న టీకొట్టు వద్ద ఉంటానని రవి చెప్పాడు. దీంతో చింటూ అక్కడికి చేరుకుని అతడితో గొడవ పడుతుండగా మిగిలిన నిందితులు మోటార్‌బైక్‌లపై వచ్చి కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసి పరారయ్యారు. ప్రత్యక్ష సాక్షి రవితేజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా గురువారం నిందితులను అరెస్ట్‌ చేసి రెండు బైక్‌లు, నాలుగు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. కేసును ఛేదించిన సాంబశివరావు, ఎస్సై విజయ శ్రీనివాస్, హెచ్‌సీలు జయరామయ్య, సుధాకర్‌రావు, శివకుమార్, వెంకటరావు, రమేష్, కానిస్టేబుళ్లు శ్రీహరి, తిరుపతి, పార్థసారథి, ఓవీఎస్‌ శివప్రసాద్, లాజర్, సాయికిశోర్‌లను ఎస్పీ అభినందించారు.

శుభకార్యానికి వస్తూ.. అనంత లోకాలకు

- రోడ్డు ప్రమాద మృతులది మర్రిపాడు మండలం
- ఉపాధి నిమిత్తం 20 ఏళ్ల క్రితం బెంగళూరుకు..
- చుంచులూరులో విషాదం



శ్రీనివాసులు కుటుంబం (ఫైల్‌)

మర్రిపాడు: కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి స్వస్థలం మర్రిపాడు మండలంగా గుర్తించారు. ఆ కుటుంబం 20 సంవత్సరాల క్రితం కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరుకు వెళ్లి అక్కడే స్థిరపడింది. స్వగ్రామంలో బంధువుల వివాహానికి కారులో బయలుదేరగా రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. దీంతో స్వగ్రామంలో గురువారం విషాదం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. మర్రిపాడు మండలం చుంచులూరు ఎస్సీ కాలనీకి చెందిన బోటిక శ్రీనివాసులు (50) వ్యాపార నిమిత్తం బెంగళూరులో స్థిరపడ్డారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. బంధువులకు చెందిన వివాహం ఉందని, రావాలని వారికి ఆహ్వానం అందింది. దీంతో శ్రీనివాసులు తన భార్య పుష్ప (45), కుమారుడు శ్రీకాంత్‌ (26)తో కలిసి బెంగళూరు నుంచి బుధవారం కారులో చుంచులూరుకు బయలుదేరారు. చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి వద్ద కంచార్లపల్లి పరిధిలో గల దండుపాళ్యం గేట్‌ వద్ద టెంపో ట్రావెలర్, కారు ఢీకొన్న ప్రమాదంలో ఆ ముగ్గురు మృతిచెందారు. శుభకార్యానికి వస్తూ తమ వారు మృతి చెందారన్న సమాచారం తెలుసుకున్న బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

కువైట్‌ నుంచి మర్రిపాడుకు చేరిన మృతదేహం

మర్రిపాడు: మండలంలోని బాలుపల్లికి చెందిన సయ్యద్‌ ఇబ్రహీం కుటుంబ పోషణ నిమిత్తం కొన్ని సంవత్సరాల క్రితం కువైట్‌కు వెళ్లాడు. మూడురోజుల క్రితం అక్కడ గుండెపోటుతో చనిపోయాడు. కువైట్‌ నుంచి మృతదేహాన్ని గురువారం మర్రిపాడుకు తీసుకొచ్చారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్‌): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై గురువారం తెల్లవారుజామున జరిగింది. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. తెలుపు రంగు హాఫ్‌ హ్యాండ్స్‌ చొక్కా, తెలుపు, నీలం రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని జీజీహెచ్‌ మార్చురీకి తరలించి రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్‌ (లైవ్‌)	: 110
లేయర్‌ (లైవ్‌)	: 105
బ్రాయిలర్‌ చికెన్‌	: 204
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	: 224
లేయర్‌ చికెన్‌	: 178

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.100
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30

